క్లుప్తంగా

పొగాకు ప్రాణాంతకం


ప్రతిజ్ఞ చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పులివెందుల రూరల్: పొగాకు వినియోగం ప్రాణాంతకమని పులివెందుల ఏరియా ఆస్పత్రి ఐటీటీసీ కౌన్సిలర్ సుబ్బయ్య, పొగాకు నివారణ సంస్థ కౌన్సిలర్ సుమలత హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పులివెందుల ఏరియా ఆస్పత్రిలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పొగాకు వినియోగం వలన గుండెజబ్బులు, ఊపిరితిత్తులు పాడవడం, పక్షవాతం, నోటి క్యాన్సర్ తదితర వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఎవరు పబ్లిక్ స్మోకింగ్ చేయకూడదని, అలా చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సిగరెట్, పొగాకు ఉత్పత్తుల చట్టం–2003 కఠినంగా అమలు పరచడం కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, బాదల్‌వల్లి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ మేనేజర్ వల్లి, అకౌంటెంట్ నాగిని బాషా, శాంతి, పుష్పరాజు, భాగ్యలక్ష్మి, అనురాధ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాప్‌లో చోరీ

పులివెందుల రూరల్: పట్టణంలోని పాతబస్టాండు సమీపంలోని సత్రంబడి పాఠశాల ప్రహరీగోడకు పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాపులో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాపుకు ఉన్న తాళాలు పగులగొట్టి సుమారు రూ.10 వేలు విలువగల పానియాల కేసులను అపహరించి తీసుకెళ్లినట్లు బాధితులు లాబా తెలిపారు. గతంలో కూడా ఇదే షాపులో సుమారు రూ.50 వేలు విలువ గల దుస్తులను అపహరించినట్లు బాధితులు తెలిపారు. పట్టణంలో చోరీలకు పాల్పడే వారి సంఖ్య ఎక్కువైందని పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు రాత్రి సమయాల్లో పహారా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

29న గంగమ్మ తల్లి వార్షికోత్సవం


గంగమ్మతల్లి మూల విరాట్

ఎర్రగుంట్ల : ఏరువాక గంగమ్మ తల్లి వార్షికోత్సవాన్ని ఈ నెల 29న నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 29 ఉదయం నుంచి మహాగణపతి పూజ, కలశస్థాపన, అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన నిర్వహించనున్నారు. వార్షికోత్సవంలో భక్తులు పాల్గొని గంగమ్మ తల్లిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ కోరింది.

రేపు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక బాకరాపురంలోని దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆస్పత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్స అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆస్పత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డా.ఇసి. దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9703622831, 08568286189 అనే ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అనాథలకు అండగా నిలుస్తాం


పాడె మోస్తున్న మే ఐ హెల్ప్‌యూ సభ్యులు

జమ్మలమడుగు: అనాథలుగా మరణించిన వారికి అంత్యక్రియలు చేయటానికి తాము ఉన్నామంటూ మేఐహెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు ముందుకు వస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని నాగులకట్ట వీధిలో నివాసం ఉంటున్న పడిసిల బాల గుర్రమ్మ అనే వృద్ధురాలు మరణించడంతో బంధువులు అంత్యక్రియలు నిర్వహించటానికి ముందుకు రాకపోవడంతో మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ అధ్యక్షుడు కిరణ్‌మోరె తన సిబ్బందితో కలసి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబహాన్, శ్రీరామ్, రమేష్, సుమన్ పాల్గొన్నారు.

ఘన సన్మానం

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కల్లూరు పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తూ పదోన్నతిపై కడప రిమ్స్‌కు బదిలీ అయిన శరత్‌బాబును అధికారులు, సిబ్బంది సన్మానించారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

కాడెద్దులు కనుమరుగు..!


దుక్కి దున్నుతున్న రైతు


వ్యవసాయం చేసేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్

ఒకప్పుడు దుక్కిదున్నాలన్నా.. విత్తనం వేయాలన్నా.. పండించిన పంట ఇంటికి చేరాలన్నా కాడెద్దులు.. ఎడ్ల బండి కావాల్సిందే. వ్యవసాయంలో వాటి పాత్ర చాలా కీలకం. ఇప్పుడు యంత్రీకరణ పేరుతో ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు కాడెద్దులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. కాడెద్దులు చూద్దామన్నా కానరాని పరిస్థితి ఏర్పడుతోంది. గ్రామాల్లో ఒకటి.. రెండు కనపడుతున్నా అవి జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి. రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిన ఎద్దు.. బండ్లు నేడు ఉనికిని కోల్పోతున్నాయి.

- వ్యవసాయంలో పెరిగిపోయిన ఆధునిక యంత్రాలు
- ఖర్చు తక్కువ.. సమయం ఆదా
- ఆదరణ కోల్పోతున్న బండ్లు

పులివెందుల రూరల్: ఒకప్పుడు వ్యవసాయం చేసే రైతుల ఇంటి వద్ద ఎద్దులు, బండి, పశువులు, పశువు లకొట్టం ఇలా సందడి సందడిగా ఆహ్లాదవాతావరణం ఉండేది. ఎడ్లబండ్లు ఉండే రైతులకు ఏడాదంతా పని దొరికేది. అటు రైతులు, ఇటు పశుపోషకుల కుటుంబాలు ఆనందంగా ఉండేవి. ప్రస్తుతం సాంకేతికత పెరిగిపోవడంతో అన్నదాతలు తక్కువ సమయంలోనే పనులు ముగించుకునేలా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుత కంప్యూటర్ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా రైతుల ఇళ్ల ఎదుట ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి. ఎడ్ల బండి ఉన్నా వాటిని వ్యవసాయానికి పిలిచే వారు లేరు. తక్కువ సమయంలోనే ఎక్కువ పనులు చేసేలా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. రైతులు వాటివైపు మొగ్గు చూపుతున్నారు.

సబ్సిడీలో ఆధునిక యంత్రాలు

ఒకప్పుడు ఏవిధమైన ప్రభుత్వ ప్రోత్సాహం లేకుండానే వ్యవసాయ పనులు చేసేవారు. కానీ ప్రస్తుతం వ్యవసాయానికి ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలను ప్రవేశపెడుతున్నాయి. సన్న, చిన్నకారు రైతులు కూడా సాంకేతిక ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చేలా రాయితీలపై ట్రాక్టర్లు, గొర్రులు, నాట్లు వేసే యంత్రాలు, కోత మిషన్లు ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వాయిదాలో యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎద్దుల వ్యవసాయం రానురాను కనుమరుగైపోయింది.

గతంలో భలే గిరాకి

గతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు ఎద్దులు, బండ్లు సిద్ధం చేసుకునేవారు వాటికి మంచి గిరాకీ ఉండేది. సాగుకు అవసరమైన పనులు చేయించుకునేందుకు ముందుగానే అడ్వాన్స్ ఇచ్చేవారు. కూలీలకు కూడా గిరాకీ ఉండేది. ఇప్పుడు కేవలం కలుపు తీయడానికి, పురుగు మందులు చల్లడానికి తప్పితే కూలీలకు పనులు ఉండడం లేదని రైతులు చెబుతున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంఈఓలు


సింహాద్రిపురం: ఎంఈఓ ఓబులేసును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్: పులివెందుల ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం ఎంఈఓ–1గా చంద్రశేఖర్ రావు, ఎంఈఓ–2గా రామానాయుడు పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను సకాలంలో సమకూర్చి విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల విద్యాశాఖ అధికారిగా ఓబులేసు

సింహాద్రిపురం: సింహాద్రిపురం మండలం ఇన్‌చార్జి ఎంఈఓగా ఓబులేసు బాధ్యతలు చేపట్టారు. ఆయన కొండాపురం ఎంఈఓగా పనిచేస్తూ సింహాద్రిపురానికి నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టడంతో ఎంఈఓ–2 శారదదేవి, మండలంలోని ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఇక్కడ ఎంఈఓగా పనిచేస్తున్న శ్రీనివాసులరెడ్డి లింగాలకు బదిలీపై వెళ్లారు.

లింగాల: లింగాల ఎంఈఓ–1గా పులివెందుల అహోబిలాపురం పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న బి.శ్రీనివాసులరెడ్డి శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా లింగాల మండలం పెద్దకుడాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న బి.రామకృష్ణయ్య ఎంఈఓ–2గా పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు

మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి


సమస్యలపై ఆరాతీస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్: పులివెందుల మున్సిపాలిటీలో మంచినీటి సరఫరా చేసే పైపులైన్లు లీకేజీలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి సరిచేయాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల మున్సిపాలిటీలోని పలు వార్డులలో ఆయన పర్యటించి అక్కడ సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల అవసరాల కోసం వినియోగించే మంచినీటిని ప్రతీరోజు సరఫరా అయ్యేలా మున్సిపల్ అధికారులు చూడాలని సూచించారు. ప్రతి ఇంటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని మరింత మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో ప్రిన్సిపాల్ సురేష్ బాబు

వల్లూరు: మండల పరిధిలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్)కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న కె. లిఖిత శ్రీ, పి. కార్తీక్, జి. రాజిత ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ పోటీ పరీక్షలో తమ ప్రతిభను చాటి స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి నాలుగేళ్ల పాటు ఒక్కొక్కరికి ఏడాది రూ.12 వేల చొప్పున స్కాలర్ షిప్ అందుతుందని తెలిపారు. విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించండి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జమ్మలమడుగు: మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య ఉన్న చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం స్థానిక కన్నెలూరు 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. చిన్న పిల్లలకు మంచి పౌష్టికాహారంతోపాటు వారికి ఆడుకోవడం కోసం ప్రత్యేక సామాగ్రిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు గంగాదేవి, మాధవి, రోషన్వి, భవాని, కుమారి పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా మూలవిరాట్

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని లింగాపురం గ్రామంలో వెలసిన శ్రీ షిర్డీసాయిబాబ ఆలయంలో శుక్రవారం ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలను శ్రీ షిర్డీ సాయిబాబా సేవాశ్రమం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలుకుని విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ, సాయిసత్యవ్రతం, చందనోత్సవం, మధ్యాహ్నం హారతి తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1000 మందికిపైగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.

నేటి నుంచి గంగమ్మ తిరునాల

మైదుకూరు : మండలంలోని శివపురంలో శని, ఆదివారాల్లో గ్రామ దేవత గంగమ్మ తిరునాల నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కొండా భాస్కర్ రెడ్డి, గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో 15వ తేదీ శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, రాత్రి రేలా రే రేలా కార్యక్రమం ఉంటుందని, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 16వ తేదీ ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సేద్యపు ఎద్దులకు బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. బండలాగుడు పోటీల్లో విజేతలకు రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతులు ఉంటాయని వివరించారు. అదే రోజు మనుషులు గుండు ఎత్తే పందెంతోపాటు ట్రాక్టర్ రివర్స్‌లో నడిపే పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. తిరునాల మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

విప్లవ చైతన్య జ్వాల చే గువేరా


చే గువేరా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విప్లవ చైతన్య జ్వాల చే గువేరా అని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ కొనియాడారు. శుక్రవారం చే గువేరా జయంతిని కడపలోని ప్రభుత్వ ఐటీఐలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చే గువేరా చేసిన సేవలను ప్రశంసించారు. చే గువేరా భావితరాలకు ఆదర్శమన్నారు. జీఆర్‌ఎస్ వైస్ జిల్లా అధ్యక్షులు రెడ్డిసాయి, నాయకులు శ్రీకాంత్, నాగమునెయ్య, నవీన్, తేజ, వీరభద్రాచారి, అభిలాష్, బాలాజీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ సూచించారు. శుక్రవారం 'ఫ్రైడే డ్రై–డే' కార్యక్రమంలో భాగంగా కడప నగరం నాగరాజుపేట అర్బన్ ట్రెయింగ్ హెల్త్ సెంటర్ పరిధిలోని సీయోన్ పురం ప్రాంతంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పర్యటించారు. డ్రైనేజీ కాలువలో పూడిక తీయించి లార్వా నాశక ద్రావణాన్ని పిచికారి చేయించారు. స్థానికులకు గ్రూప్ మీటింగ్ నిర్వహించి సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాప్తి జరిగే వ్యాధుల గురించి వివరించారు.

రక్తదానం.. ప్రాణదానం


కమలాపురం: రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్: రక్తదానం మరొకరి జీవితానికి వెలుగు.. రక్తదానం చేయండి–ప్రాణదాతలు కండి అని సర్వజన ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్ డా.మల్లేశ్వరి పిలుపునిచ్చారు. రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పులివెందుల పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ సర్వజన ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువకులు దివ్య డెంటల్ క్లీనిక్ డా.అనూప్‌రెడ్డితో పాటు 20మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డా.మల్లేశ్వరి మాట్లాడుతూ అన్ని దానాలకంటే ప్రాణాలు కాపాడే రక్తదానం దేవుడు మనిషికి ఇచ్చిన గొప్పవరమన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులకు మెడికల్ సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి, ప్రొఫెసర్ డా.వరలక్ష్మి, రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డా.గీతిక, డా.నాహిద్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. స్నేహితఅమృతహస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ కుముదవల్లి, పార్వతి, హెడ్‌నర్స్ విజయనిర్మల, రక్తనిధి ల్యాబ్ టెక్నీషియన్ మహమ్మద్ రఫీ, అన్నమ్మల్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కమలాపురం: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ కళాశాలలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం దొరకక చాలా మంది ప్రాణాలు కోల్పోతుంటారన్నారు. అలాంటి వారికి రక్తం అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రక్తం దానం చేయడం అందరి బాధ్యత అన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, 18 ఏళ్ల పైబడిన వారంతా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో రక్తదానం అత్యవసరం అన్నారు. యువత రక్తదాన సమయాల్లో స్పందించాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించారు. అలాగే వారికి రిమ్స్ బ్లడ్ బ్యాంక్ వారు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డా.పల్లాకృష్ణ, వినయ్‌కుమార్, శ్రీవాణి, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.


పులివెందుల రూరల్: రక్తదానం చేస్తున్న యువకులు

కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం




ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయుడు, బండలాగుడు పోటీలు జరుగుతున్న దృశ్యం

ఖాజీపేట : తవ్వారిపల్లె గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయ 7వ వార్షికోత్సవ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానికులు పెద్ద ఎత్తున వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం సేద్యపు ఎద్దులతో బండలాగుడు పోటీలను ఆయల కమిటీ సభ్యులు నిర్వహించారు. గెలిచిన వారికి కమిటీ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు. ఉత్సవాల కోసం వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. దీంతో ఉత్సవాలు అత్యంత వైభవంగా పూర్తయ్యాయి.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చతుస్థానార్చన మూలమూర్తి హోమం, ఉత్సవబలి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన గరుడవాహనసేవలో శ్రీనివాసుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య, రమేష్‌శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు నాగభైరవ కోటేశ్వరరావు

బద్వేలు అర్బన్ : నేటి సమాజానికి సాహితీ స్ఫూర్తి కలిగించిన నాగభైరవ కోటేశ్వరరావు చిరస్మరణీయులు అని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కొనియాడారు. ప్రముఖ కవి, సాహితీవేత్త నాగభైరవ కోటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోటేశ్వరరావు రచనలలో సమాజ శ్రేయస్సు, అణగారిన వర్గాల పట్ల కరుణ, సానుభూతి కనిపిస్తాయని తెలిపారు. నాగభైరవ భువన విజయమునకు పేరడిగా కవన విజయం అనే సాహిత్య రూపకాన్ని రూపొందించి 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గుండ్లకమ్మ చెప్పిన కథ, తూర్పు వాకిళ్లు, ఒయాసిస్, కన్నీటిగాథ వంటి రచనలు ఎంతో ప్రఖ్యాతి గాంచాయని కొనియాడారు. తెలుగు సాహిత్యానికి కోటేశ్వరరావు చేసిన కృషిని వక్తలు ప్రశంసించారు. తొలుత నాగభైరవ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో భాగ్యరత్న ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి


ఎర్రగుంట్ల : మాట్లాడుతున్న సీఐ ఈశ్వరయ్య


పెండ్లిమర్రి: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ హరిప్రసాద్

ఎర్రగుంట్ల : బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ ఈశ్వరయ్య సూచించారు. శుక్రవారం యర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు జరుగకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవితో పాటు మత పెద్దలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని, పండుగ సమయాల్లో ఎలాంటి రాజకీయ కక్షలకు పూనుకోవద్దని మత పెద్దలకు సూచించారు. ముస్లిం మతపెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ హరిప్రసాద్ అన్నారు. పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం బక్రీద్ పండుగ సందర్భంగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పండుగను ప్రశాతంగా జరుపుకోవాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దముడియం: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి గొడవలు లేకుండా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.